క్లుప్తంగా

హైస్కూల్‌కు మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్ అందిస్తున్న నాగరాజు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్‌కు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుడు మన్నం నాగరాజు ఆర్థిక సహకారంతో శనివారం మైక్‌సెట్ అందించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం వినియోగించుకోవాలని నాగరాజు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పుట్టిన రోజు సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎంతో పాటు స్థానికులు రోటరీ క్లబ్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కే రామకృష్ణ, కే సుధాకర్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రానైట్ యజమానుల విరాళం



సీఎంకు చెక్కు అందిస్తున్న గ్రానైట్ యజమానులు

చీమకుర్తి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చీమకుర్తికి చెందిన గ్రానైట్ యజమానులు నూనె సుబ్రహ్మణ్యం, నూనె హేమసుందరం, వంశీకృష్ణ, చంద్రమౌళి, వీరాంజనేయులు ఆధ్వర్యంలో రూ.2 లక్షల చెక్కును శనివారం సీఎం చంద్రబాబునాయుడుకు సెక్రటేరియట్‌లో విరాళంగా అందించారు. వారిని సీఎం అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నీలం నాగేంద్రం

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు కోరారు. శనివారం చీమకుర్తి వచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్ ఆడిటోరియం భవన్‌లో నిర్వహించే సదస్సుకు పెద్ద సంఖ్యలో మాల మహానాడు కార్యకర్తలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సదస్సుకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, నాయకులు కాకుమాను రవి పాల్గొన్నారు.

మాలలంతా పాల్గొనాలి...

ఒంగోలు: ఒంగోలులోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం మాల సంఘాలు, దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని మాల ఉద్యోగుల సంఘ జిల్లా కమిటీ సభ్యులు బల్లికూర గోపీనాథ్, తుల్లిబిల్లి అశోక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మాల ఉద్యోగులు సాయంత్రం 5 గంటలకు చర్చి సెంటర్ సమీపంలోని టెలిఫోన్ భవన్ వద్ద నుంచి సదస్సు ప్రాంగణం వరకు జరిగే ర్యాలీలో భారీగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళా యాంకర్‌కు వేధింపులు

ఒంగోలు టౌన్: 'నువ్వు అందంగా ఉంటావు.. నీ ఫోన్ నంబర్ ఇవ్వు.. మాతో మాట్లాడకపోయినా, మావైపు చూడకపోయినా నీ అంతు చూస్తాం' అంటూ ఇద్దరు యువకులు ఓ మహిళా యాంకర్‌ను వేధించారు. దీంతో న్యూస్ చానల్‌లో రీడర్ కం యాంకర్‌గా పనిచేస్తున్న బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక గోపాల్‌నగర్‌కు చెందిన గుంటూరు మెర్సీ నగరంలోని ఒక లోకల్ న్యూస్ చానల్‌లో న్యూస్ రీడర్ కం యాంకర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం భోజనానికి అంజయ్య రోడ్డులోని ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్నారు. దారి మధ్యలో ఏకలవ్యనగర్‌లోని వంటవానికాలనీ వద్దకు రాగానే పతకమూరి సుబ్రహ్మణ్యం, దాసరి సుబ్రహ్మణ్యం ఆమెను అడ్డుకున్నారు. నిన్ను ప్రతిరోజూ గమనిస్తున్నాం, చాలా అందంగా ఉన్నావు, మమ్మల్ని ఎందుకు చూడవంటూ వేధించారు. నీ ఫోన్ నంబర్ ఇవ్వు, రేపటి నుంచి మాతో మాట్లాడకపోతే నీ అంతు చూస్తామంటూ బెదిరింపులకు దిగారు. దాంతో మెర్సీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దొనకొండ: ట్రాక్టర్ వేగంగా వెళ్తూ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇండ్లచెరువు గ్రామం బ్రహ్మంగారి గుడి వద్ద శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి వెంకటసుబ్బయ్య ట్రాక్టర్‌ను నడుపుకుంటూ పొలం పనుల కోసం వేగంగా వెళ్తున్నాడు. వ్యవసాయ పనులు ముగించుకుని గ్రామానికి చెందిన తమ్మనేని వెంకటేశ్వరరెడ్డి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్.. మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో వెంకటేశ్వరరెడ్డి ట్రాక్టర్ టైర్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తీసుకెళ్లారు.

తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

- హైదరాబాద్ ఇన్‌కాయిస్ సంస్థ శాస్త్రవేత్త వేదుల చంద్రశేఖర్ పిలుపు
- పలు సంస్థల ఆధ్వర్యంలో కొత్తపట్నం సముద్రతీరంలో పరిశుభ్ర కార్యక్రమాలు
- ఘనంగా అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం



కొత్తపట్నం బీచ్‌లో పరిశుభ్రం చేస్తున్న ఇన్‌కాయిస్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి ప్రతినిధులు, అధికారులు

కొత్తపట్నం: కాలుష్యం లేని సముద్రతీర ప్రాంతాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని హైదరాబాద్ ఇన్‌కాయిస్ సంస్థ శాస్త్రవేత్త వేదుల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కొత్తపట్నం బీచ్‌లో శనివారం ఇన్‌కాయిస్ హైదరాబాద్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం, స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛ సాగర్–సురక్ష సాగర్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ భూ మండలం చుట్టూ మన కోసం ఉన్న ముఖ్యమైన వనరులలో సముద్రం ఒకటని అన్నారు. కాలుష్యం నుంచి కోట్లాది జలజీవరాసులను కాపాడుకునేందుకు తీరప్రాంతాలను శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. సముద్రజీవులను ప్లాస్టిక్ వినియోగం నాశనం చేస్తుందన్నారు. మత్స్యకారులకు జీవనోపాధి ఎందుకు దొరకడం లేదో అవగాహన పెంచడం ద్వారా ప్రజల్లో మార్పుతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చన్నారు. సముద్ర సమాచార సేవలను అందించడంలో ఇన్ కాయిస్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. సంభావ్య ఫిషింగ్ జోన్ సలహాలు, సునామీ ముందుస్తు హెచ్చరికలు, అధిక అలలు, తుఫాన్ ఉప్పెన, పగడాలతో సహా బ్లీచింగ్, హానికరమైన అల్గల్ బ్లూమ్ హెచ్చరిక మొదలైన వాటి గురించి వివరించారు. మన తీరప్రాంత, సముద్ర పర్యావరణాల పరిరక్షణకు అవి దోహదం చేస్తాయన్నారు. మత్స్యకార సంక్షేమ సమితి స్టేట్ సెక్రటరీ సున్నపు తిరుపతిరావు మాట్లాడుతూ సాధ్యమైనంతగా సముద్రాన్ని కలుషితం కాకుండా చూడాలన్నారు. సమాజం, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, శాస్త్రీయ సమాజానికి సమాచారం, సలహా సేవలు, క్రమబద్ధమైన కేంద్రీకృత పరిశోధనల ద్వారా నిరంతరం సముద్ర పరిశీలనలు, స్థిరమైన మెరుగుల ద్వారా సముద్ర మోడలింగ్ మార్పు చేయడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ జేడీ ఆరుల చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ చాపల వంశీకృష్ణ, డీటీఓ బెన్‌హర్, మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు, మత్స్యకార సంక్షేమ సమితి బీచ్ ఇన్‌చార్జి రేవు చలపతివర్మ, సర్పంచ్ ఆనంద్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు, జాలరామ్ మత్స్యకారులు పాల్గొన్నారు.



తీరాన్ని శుభ్రం చేసిన అనంతరం వ్యర్థాల సంచులతో కొత్తపట్నం హైస్కూల్ విద్యార్థులు

తీరాన్ని శుభ్రం చేసిన విద్యార్థులు...

కొత్తపట్నం సముద్ర తీరాన్ని స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పరిశుభ్రం చేశారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా స్కూల్లో చదువుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతాజీ ట్రూప్, డాక్టర్ వీఆర్ అంబేడ్కర్ గ్రూప్, సావిత్రిబాయి ఫ్లాక్ విద్యార్థులు తీర ప్రాంతంలోని వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, వినాయక నిమజ్జనాల నేపథ్యంలో ఏర్పడిన వ్యర్థ పదార్థాలను సేకరించి తరలించి బీచ్ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. మొత్తం 208 మంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ తన్నీరు బాలాజీ మాట్లాడుతూ మన పాఠశాలలను, గృహాలను, పరిసరాలను ప్రతిరోజూ ఏ విధంగా శుభ్రం చేసుకుంటామో.. అదే విధంగా సముద్ర తీర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం జరగడం హర్షనీయమన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వలన మనుషులకే కాకుండా జలచరాలకు కూడా హాని కలుగుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కేవీ శేషారావు, జిల్లా కోశాధికారి పెరై వెంకట్రావు, ఫ్లాక్ లీడర్ కె.పద్మశ్రీ, స్కౌట్స్ మాస్టర్ చెక్క కోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు సురేంద్రబాబు, బాలాజీ, నరసింహారావు, వెంకట కృష్ణయ్య, శేషగిరి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేస్ కాలేజీ విద్యార్థులు...

ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు కూడా కొత్తపట్నం బీచ్‌లో శుభ్రం చేశారు. స్వచ్ఛతా హై సేవ కార్యక్రమంలో భాగంగా ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనింగ్ డే సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, మత్స్యకార సంఘ అధ్యక్షుడు తిరుమలరావు, కె.పల్లెపాలెం సర్పంచ్ వి.ఆనంద్‌రావు, పేస్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రావు, బి.సురేష్‌కుమార్, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ కెప్టెన్ ఎ.పృథ్వీకృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మద్దిపాడు మండల క్రీడాకారులు ఎంపిక

మద్దిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహించిన విషయం విదితమే. ఆయా పోటీల్లో ప్రతిభ చూపి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను శనివారం ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ పాపారావు ప్రకటించారు.

ఎంపికైన జట్లు...

- కబడ్డీ అండర్–17 బాలికల విభాగంలో గుండ్లాపల్లి మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో ఇనమనమెళ్లూరు జట్టు నిలిచింది. బాలుర విభాగంలో ఇనమనమెళ్లూరు మొదటి స్థానం, మద్దిపాడు జట్టు రెండో స్థానంలో నిలిచింది. అండర్–14 విభాగంలో ఇనమనమెళ్లూరు బాలుర జట్టు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో తెల్లబాడు జట్టు నిలిచింది. ఇనమనమెళ్లూరు బాలికల జట్టు మొదటి స్థానంలో నిలవగా, తెల్లబాడు బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది.
- వాలీబాల్ అండర్–17 బాలుర విభాగంలో గుండ్లాపల్లి పాఠశాల జట్టు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో లింగంగుంట పాఠశాల జట్టు నిలిచింది. బాలికల విభాగంలో గుండ్లాపల్లి మొదటి స్థానం, పెదకొత్తపల్లి జట్టు రెండో స్థానంలో నిలిచింది. అండర్–14 విభాగంలో ఇనమనమెళ్లూరు బాలుర జట్టు మొదటిస్థానంలో నిలవగా, రెండో స్థానంలో బసవన్నపాలెం జట్టు నిలిచింది. బాలికల విభాగంలో గుండ్లాపల్లి జట్టు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో పెదకొత్తపల్లి జట్టు నిలిచింది.
- ఖోఖో పోటీల్లో అండర్–17 బాలుర విభాగంలో ఇనమనమెళ్లూరు జట్టు మొదటి స్థానంలో నిలవగా, తెల్లబాడు జట్టు రెండో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో గుండ్లాపల్లి మొదటి స్థానంలో నిలవగా, తెల్లబాడు జట్టు రెండో స్థానంలో నిలిచింది. అండర్–14 విభాగంలో తెల్లబాడు బాలుర జట్టు మొదటి స్థానంలో నిలవగా, అదే తెల్లబాడుకు చెందిన మరో జట్టు రెండో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో మద్దిపాడు జట్టు మొదటి స్థానంలో నిలవగా, గుండ్లాపల్లి జట్టు రెండో స్థానంలో నిలిచింది.
- బ్యాడ్మింటన్ అండర్–17 బాలుర విభాగంలో మద్దిపాడు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో గుండ్లాపల్లి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో తెల్లబాడు జట్టు మొదటి స్థానంలో నిలవగా, మద్దిపాడు జట్టు రెండో స్థానంలో నిలిచింది. అండర్–14 బాలుర విభాగంలో పెదకొత్తపల్లి మొదటి స్థానం, తెల్లబాడు జట్టు రెండో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో గుండ్లాపల్లి మొదటి స్థానం, లింగంగుంట జట్టు రెండో స్థానంలో నిలిచింది.

ఎంపికైన క్రీడాకారులు...

అండర్–17 కబడ్డీ పోటీలకు బసవన్నపాలెం విద్యార్థులు అవినాష్, జగదీష్, గుండ్లాపల్లి నుంచి శేఖర్, సూర్యప్రకాష్, మద్దిపాడు నుంచి ప్రభుదేవా, జసీముద్దీన్, విలియమ్స్, సందీప్, ఇనమనమెళ్లూరు నేతాజీ పాఠశాల నుంచి ఏసు దయాకర్, శ్యాంచరణ్, అవనిధ్, తెల్లబాడు పాఠశాల నుంచి మహేష్‌బాబు, శంకర్, రాకేష్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో మద్దిపాడు నుంచి జ్యోత్స్న, ఇనమనమెళ్లూరు నుంచి భువన, జ్యోతి, అక్షయ, గుండ్లాపల్లి నుంచి ఐశ్వర్య రాణి, అలేఖ్య, మానస, బ్యూలా, తెల్లబాడు పాఠశాల నుంచి హెప్సిబా, అర్చన, లీలావతి, నవ్య ఎంపికయ్యారు. అండర్–17 వాలీబాల్ బాలుర విభాగానికి లింగంగుంట పాఠశాల నుంచి సంతోష్‌కుమార్, కార్తిక్ రణదేవ్, సుశాంత్‌కుమార్, మద్దిపాడు నుంచి అభిషేక్, జసీముద్దీన్, ఇనమనమెళ్లూరు నుంచి ఠాగూర్, అనిల్, గుండ్లాపల్లి నుంచి నాగచరణ్, శరణ్యకుమార్, వేణుబాబు, పార్థసారధి, తెల్లబాడు నుంచి సమీర్ ఎంపికయ్యారు. అండర్–14 బాలుర జట్టుకు ఇనమనమెళ్లూరు నుంచి ఆకాశ్, నోయల్, అభిషేక్, పెదకొత్తపల్లి నుంచి రామ్‌చరణ్, పవన్‌కుమార్‌రెడ్డి, గుండ్లాపల్లి నుంచి రవీంద్ర, శేఖర్, ఇనమనమెళ్లూరు నేతాజీ స్కూల్ నుంచి మారుతి, శ్రీధర్, తెల్లబాడు నుంచి ప్రభు, అనిల్ ఎంపికైనట్లు కో ఆర్డినేటర్ వివరించారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నియోజకవర్గ స్థాయి పోటీల్లో మండలం తరఫున పాల్గొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

టీజేఆర్ సుధాకర్‌బాబును అభినందించిన నాయకులు



టీజేఆర్ సుధాకర్‌బాబును అభినందిస్తున్న ఎస్సీ నాయకులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన పలువురు ఎస్సీ నాయకులు మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలోని టీజేఆర్ నివాసంలో శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీజేఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వంలో ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగడతానని, ఎస్సీలకు న్యాయపరంగా రావాల్సిన వాటిని సాధించేందుకు తన శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు. పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి మల్లవరంలోని తన ఇంటికి టీజేఆర్ వచ్చిన సందర్భంగా స్థానిక నాయకులు పలువురు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన టీజేఆర్...

మద్దిపాడు మండలంలోని పెదకొత్తపల్లి ఎంపీటీసీ మందా సమాధానం కుమారుడు రాబర్ట్, అఖిల వివాహం జరిగిన సందర్భంగా వారిని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. పెదకొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మారెళ్లగుంటపాలెంలో ఎంపీటీసీ ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మోరబోయిన సంజీవరావు, ఎర్ర దశరథ, హరిబాబు, పలువురు ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

ఒంగోలు సెంట్రల్: సీపీఎం ఒంగోలు 48వ డివిజన్ మహాసభను శనివారం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్, కార్యవర్గ సభ్యుడు చీకటి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై పార్టీ పోరాడుతోందన్నారు. దిబ్బలరోడ్డులో పార్కును వెంటనే ప్రారంభించాలని, పాత మంచినీటి పైప్‌లైన్ తొలగించి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చెయ్యాలని, కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని, ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని తీర్మానం చేశారు. వీటి కోసం ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం శాఖ కార్యదర్శిగా జి.బీష్మాచారిని ఎన్నుకున్నారు. యువజన రంగం శాఖ పి.రాంబాబు అధ్యక్షత వహించగా, త్వరగా డీఎస్సీ పూర్తి చెయ్యాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని తీర్మానించారు. శాఖ కార్యదర్శిగా సీహెచ్ మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలి

ఒంగోలు: పాఠశాల స్థాయిలో ఈ నెల 25వ తేదీ నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను స్థానిక డీఈఓ కార్యాలయంలో శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని, సృజనాత్మకతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయప్రకాష్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా ఈ నెల 25వ తేదీ ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా తరగతులలో మొదటి స్థానం పొందిన ముగ్గురు విద్యార్థులు ఒక జట్టుగా అక్టోబర్ 1న జరిగే మండల/పట్టణ స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఉపవిద్యాశాఖాధికారి సామా సుబ్బారావు, జేవీవీ నగర అధ్యక్షుడు ఎస్‌వీ రంగారెడ్డి, నగర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ, ఆర్.నారాయణ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనకు సహకరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్సై, సిబ్బంది

నాగులుప్పలపాడు: హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బాపట్ల, ప్రకాశం ఉమ్మడి జిల్లాల హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన సంస్థలు, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి మీకు తెలుసా అనే అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా నిర్మూలన, వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలపై క్షేత్ర స్థాయిలో యువతీ, యువకులను, ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు వ్యవస్థపై ఉందన్నారు. అందరూ సమన్వయంతో కృషి చేస్తే ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన కూడా సాధ్యమవుతుందన్నారు. సుఖ వ్యాధుల నిర్మూలన, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని 2030 నాటికి రాష్ట్రంలో, దేశంలో లేకుండా చేయాలనే నిశ్చయంతో అందరం కలిసి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బారావు, దుర్గా, మల్లేశ్వరి, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

పీవీఆర్ జీవితం యువతకు ఆదర్శం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు సెంట్రల్: కార్మిక సంఘ నాయకుడు, సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు పీవీఆర్ చౌదరి జీవితం యువతకు ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. ఒంగోలు మల్లయ్య లింగం భవన్‌లో శనివారం సీపీఐ నగర సమితి, ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో పీవీఆర్ చౌదరి సంతాప సభ నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకుడు ఉప్పుటూరి ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏపీ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ పీవీఆర్ తన జీవితంలో చివరి రోజు వరకు నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి పనిచేశారని కొనియాడారు. సీపీఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ (ఎంఎల్) కార్యదర్శి స్వామి, జిల్లా నాయకుడు కొండారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని పీవీఆర్ చౌదరి సేవలను కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్ట్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు



నాగులుప్పలపాడు మండలంలో ఎంపికైన ఉప్పుగుండూరు క్రీడాకారులు

కొత్తపట్నం: మండలంలో రెండురోజుల నుంచి జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి ఎంపిక పోటీలు శనివారంతో ముగిసినట్లు హెచ్‌ఎం ఎం.శ్రీదేవి తెలిపారు. విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, త్రోబాల్ పోటీలు నిర్వహించామని, ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతామని ఆమె పేర్కొన్నారు. అండర్–14, 17 విభాగాలకు సంబంధించి నాలుగు జట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. కొత్తపట్నం పాఠశాల తరఫున విద్యార్థులు ఎంపికయ్యేందుకు కృషి చేయాలని పీడీలను కోరారు. ఎస్‌ఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి తన సొంత నగదుతో క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, పీడీ సాయికిషోర్, జీవశాస్త్ర, ఆంగ్ల ఉపాధ్యాయురాలు కోడూరి ధనలక్ష్మి, శరత్‌చంద్ర, ఫిజికల్ డైరెక్టర్ భాను ప్రతాప్, ఈతముక్కల, అల్లూరు, ఆలూరు, గమళ్లపాలెం, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు విద్యార్థుల హవా...

నాగులుప్పలపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నాగులుప్పలపాడు మండల స్థాయి ఎంపిక పోటీలను బీ నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించగా, ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వాలీబాల్ అండర్–17 విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. అండర్–14లో ద్వితీయ స్థానం, కబడ్డీ బాలికల అండర్–17, అండర్–14 విభాగాలలో ప్రథమ స్థానం, అండర్–14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. వీరిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

నాగులుప్పలపాడు: కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కౌలు రైతు సంఘ నాయకుడు తూబాటి శ్రీకాంత్ కోరారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నట్టేట ముంచేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వెంటనే రైతాంగానికి ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలకు రైతు సంఘ నాయకులు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జయంత్ బాబు, బసవపున్నయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కుళాయి పన్ను వసూలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో కుళాయి పన్ను బకాయిలు మొత్తం రూ.8.41 కోట్లను వీలైనంత త్వరగా వసూలు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఎమినిటీస్ సెక్రటరీలను ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాలులో శనివారం నగరంలోని 70 వార్డు సచివాలయాల ఎమినిటీస్ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుళాయి కనెక్షన్లకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. అక్రమ కనెక్షన్లు ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. పన్నుల విషయంలో ఉదార స్వభావం పనికిరాదన్నారు. నగరంలోని మొత్తం కుళాయి కనెక్షన్లను పరిశీలించాలని, వార్డు సచివాలయాల వారీగా కుళాయి కనెక్షన్ల వివరాలను నివేదిక రూపంలో ఏఈలకు అందజేయాలని ఆదేశించారు. గడువులోపు క్రమబద్ధీకరించని కుళాయిలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

పారిశుధ్య పనులను సక్రమంగా చేయాలి...

నగరంలో పారిశుధ్య పనులను సక్రమంగా చేయకపోతే చర్యలు తప్పవని పారిశుధ్య సిబ్బందిని కమిషనర్ హెచ్చరించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టని పారిశుధ్య సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 5వ డివిజన్ గోపాల్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ సెక్రటరీకి నోటీసు జారీ చేశారు. మరోసారి ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత 18వ డివిజన్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో మేయర్ సుజాతతో కలిసి పాల్గొన్న కమిషనర్ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

స్వచ్ఛతా హీ సేవపై ప్రత్యేక దృష్టి సారించాలి...

ఒంగోలు నగరంలో చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని వార్డు సచివాలయ అడ్మిన్లు, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులను కమిషనర్ ఆదేశించారు. స్థానిక ఆయన చాంబర్‌లో శనివారం రాత్రి నగరంలోని 70 వార్డు సచివాలయాల అడ్మిన్లు, నగరపాలక సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమవారం వార్డు పరిధిలో సభలు నిర్వహించాలన్నారు.

నేడు కూడా పన్నులు చెల్లించవచ్చు...

ఒంగోలు నగర ప్రజలు పన్నులను ఆదివారం కూడా చెల్లించవచ్చని కమిషనర్ తెలిపారు. కార్యాలయానికి ఆదివారం సెలవు అయినప్పటికీ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, కుళాయి పన్నులు యథావిధిగా కట్టించుకుంటారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వెంకయ్యస్వామికి పూజలు



వెంకయ్యస్వామి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ప్రాతఃకాలమున స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి కర్పూర హారతితో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఏడు గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజలు, నగరోత్సవం నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వెంకయ్యస్వామి